నేడు రాజ్‌భవన్‌లో రక్తదాన శిబిరం

జూబ్లీహిల్స్, జూన్ 13: నేడు రాజ్ భవన్‌లో జరుగనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మెన్ మామిడి భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్లు రక్తదానం చేయడం తో పాటు పెద్ద ఎత్తున రక్తదానం చేయించేందుకు దాతలను, యువతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

18 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే 2 నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం అయిదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 97035 89689, 79899 03001 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

సిగరెట్ ఇవ్వలేదని.. హత్యాయత్నం

నిందితుడు చిట్టి భూపాల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

నిందితుడిని అరెస్ట్ చేసిన నారాయణగూడ పోలీసులు

హిమాయత్‌నగర్, జూన్ 13: తాగడానికి సిగరెట్ అడిగితే ఇవ్వలేదనే అక్కసుతో ఓ వ్యక్తిపై చెక్క కుర్చీతో దాడి చేసి హత్యాయత్నం చేసిన ఓ యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ గురువారం వెల్లడించారు. నారాయణగూడ ప్లైఓవర్ సమీపంలోని పుట్‌పాత్‌పై ఉంటున్న సత్యనారాయణ (60) అక్కడే కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకొని టైలర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సత్యనారాయణ నిద్రిస్తున్న ప్రాంతం వద్దకు బుధవారం అర్ధరాత్రి శివాజీనగర్‌లో ఉంటూ గాంధీనగర్‌లోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ జీవనం సాగించే చిట్టి భూపాల్(23) వచ్చాడు. సత్యనారాయణను నిద్రలేపి సిగరెట్ ఇవ్వాలని భూపాల్ అడిగాడు. దీంతో అతడు నిరాకరించడంతో పక్కనే ఉన్న చెక్క కుర్చీతో సత్యనారాయణ ముఖం, తలపై గట్టిగా దాడిచేయగా తీవ్ర గాయాల పాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. బాధితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు భూపాల్‌ను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. గతంలో అనేక సార్లు సత్యనారాయణ వద్దకు వెళ్లి సిగరెట్ కావాలని ఇవ్వకపోవడంతోనే కక్ష పెంచుకొని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్ణీత వ్యవధిలో స్కూల్ కొత్త భవనం

● ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, జూన్ 13: నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనుల్లో భాగంగా ఎర్రమంజిల్ స్కూల్‌ను తొలగించి కొత్త భవనాన్ని నిర్ణీత కాలవ్యవధిలోగా నిర్మించేందుకు కృషి చేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రతిష్టాత్మకమైన ఎర్రమంజిల్ స్కూల్ తరలింపు పూర్తికాక ముందే స్కూల్‌కు వచ్చే దారులన్నీ మూసేయడంతో పాటు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ పూర్వ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే నాగేందర్, కార్పొరేటర్ పి.విజయారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం గురువారం స్కూల్ వద్దకు వచ్చారు. వందలాది మంది పూర్వవిద్యార్థులు ఎర్రమంజిల్ స్కూల్‌లో సమావేశం ఏర్పాటు చేసి స్కూల్‌ను రక్షించాలని, కొత్త భవనాన్ని త్వరగా నిర్మించాలని డిమాండ్ చేశారు. దీంతో నిమ్స్ విస్తరణ పనులకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్న రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో పాటు పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులను అక్కడకు పిలిపించిన ఎమ్మెల్యే సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. సుమారు నాలుగేండ్లుగా స్కూల్ తరలింపు పేరుతో విద్యార్థుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. స్కూల్‌కు కొత్త భవనం నిర్మిస్తామంటూ ఎప్పటికప్పుడు చెప్పడం తప్ప పనులు మాత్రం ఇప్పటిదాకా ప్రారంభం కాలేదని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ ఆరోపించారు. స్కూల్‌కు వచ్చే నాలుగు రోడ్లను మూసేయడంతో నిమ్స్ పార్కింగ్‌లో నుంచి విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి వస్తోందని, దీని వల్ల రోగాల పాలయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. స్పందించిన ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి వారంలోగా కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణం పూర్తయితేనే స్కూల్‌ను తరలిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇదే సమస్యలపై ఇటీవల తాను జిల్లా కలెక్టర్‌ను కలిసామని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తారని కార్పొరేటర్ విజయారెడ్డి పేర్కొన్నారు. తాత్కాలికంగా విద్యార్థులు రాకపోకలు సాగించేలా రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమ్జద్ అలీ, మురళీకృష్ణ, ఉర్మిళ, అనితారాణి, లలితశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమంజిల్ స్కూల్ పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టరర్ బీరప్ప

బీఏఎస్ఎల్పీ రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 20లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

18 నుంచి రాజకీయ శిక్షణా తరగతులు

మఖ్దూం భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూన్ 13: ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు యాదగిరిగుట్టలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.యేసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ తెలిపారు. శిక్షణా తరగతులకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ గురువారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగింది. వారు మాట్లాడుతూ అన్నిరంగాల్లో వెనుకబడిన దళితులను సామాజిక, ఆర్థిక, రాజకీయంగా చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమానత్వం, సామా జికాభివృద్ధి, కుల నిర్మూలన కాగితాలకే పరిమితమైందని వారు విమర్శించారు. ఆచరణ మాత్రంలో అమలు కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన లేకపోవడంతో పాటు ఉన్న సంస్థలను ప్రైవేటీకరించడంతో ఉపాధి అవకాశాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిక్షణా తరగతులను దళితులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సహదేవ్, నాయకులు జె.కుమార్, నరేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి పదేండ్ల జైలు

బస్వంత్‌కుమార్ నాగేందర్

హిమాయత్‌నగర్, జూన్ 13: యువకుడి హత్య కేసులో ఇద్దరికి పదేండ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.11వేల జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు గురువారం తీర్పునిచ్చింది. నారాయణగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై జి. నరేశ్ వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన సంజు(19) స్నేహితుడు రాజ్‌కుమార్‌తో కలిసి 2018 సెప్టెంబర్ 23న గణేశ్ నిమజ్జనం చూసేందుకు విఠల్‌వాడిలో అద్దె ఇంటిలో ఉండే అతని సోదరుడు శివాజీ ఇంటికి వచ్చాడు. భవనం టెర్రస్‌పై వారు మద్యం సేవిస్తుండగా ఇంటి యజమాని ముకుంద రావు కుమారుడు బస్వంత్‌కుమార్ (30) అతని స్నేహితుడు నాగేందర్(29) వచ్చి తమ అనుమతి లేకుండా మద్యం తాగుతున్నారా అని ప్రశ్నించారు. ఈ క్రమంలో సంజుకు బస్వంత్‌కుమార్ వాగ్వాదం జరిగింది. బస్వంత్‌కుమార్ అతని స్నేహితుడు నాగేందర్ సంజుపై విచక్షణ రహితంగా దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సంజు స్నేహితుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్ విచారణ చేసి నిందితులైన బస్వంత్‌కుమార్, నాగేందర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రాంరెడ్డి, పి.శైలజ నిందితులకు శిక్షపడే విధంగా కోర్టులో వాదనలు వినిపించారు. మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి.సురేశ్ కేసు ట్రయల్‌ను పూర్తి చేసి నిందితులిద్దరికీ 10 ఏండ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు 11వేలను జరిమాన విధించారని ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు.

బీఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఖాజానగర్‌లో మేయర్ పర్యటన

ఖాజానగర్‌లో పైలైన్ పనులు ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, జూన్ 13: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఖాజానగర్ బస్తీలో గురువారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో మంచినీటి సమస్యల పరిష్కారం కోసం రూ.3.5లక్షల వ్యయంతో చేపట్టిన లైన్ పనులను మేయర్ ప్రారంభించారు. డ్రైనేజీ సమస్యలతో పాటు నీటి సమస్యలు లేకుండా చూడాలని జలమండలి అధికారులను మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగులో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 13: అనతి కాలంలోనే తెలంగాణ సాగులో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ (పీజేటీఎస్ఏయూ) రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా గుర్తింపు నిలుపుకుందని పేర్కొన్నారు. ఐఏఎస్ ప్రొబెషనర్స్ వర్సిటీని సందర్శించిన సందర్భంగా ఆయన పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వర్సిటీ ఆవిర్భవించిన అనతి కాలంలోనే నూతన వంగడాలను సృష్టించడం, రైతులకు చేరవేయడం, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలను ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. వరి అధికంగాసాగు చేసి, దిగుబడులు ఎక్కువ మొత్తంలో సాధించారని చెప్పారు. వ్యవసాయ వర్సిటీ బోధన, పరిశోధన విస్తరణ విభాగంలో చేస్తున్న కార్యక్రమాలు, నిర్వహిస్తున్న కోర్సుల గురించి రిజిస్ట్రార్ వారికి వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలి

విఠల్‌వాడిలో క్యారం బోర్డ్ ఆడుతున్న మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూన్ 13: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా పెట్టుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి అన్నారు. స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా గురువారం విఠల్‌వాడి, ఆయిల్‌సీడ్స్ కాలనీల్లో క్యారం బోర్డ్ ఆడుతూ అవగాహన కల్పించారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులతో పాటు చిరువ్యాపారులను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్, జక్కి, ముజ్జులాల్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

బండ్లగూడ, జూన్ 13: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ సూచించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ ప్రథమిక పాఠశాలలో విద్యార్థులకు అమె గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు చంద్రకళ, జయ, సావిత్రి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు చేసిన ఆటో చోరీ

వెంగళరావునగర్, జూన్ 13: పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాదగిరినగర్ కమాన్ వద్ద నివాసం ఉండే ఆటో డ్రైవర్ శివ కృష్ణ(27) ఇంటి సమీపంలోని బస్తీ దవాఖాన ముందు మంగళవారం రాత్రి 10 గంటలకు ఆటోను నిలిపి వెళ్లాడు. బుధవారం ఉదయం చూసే సరికి ఆటో కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బడుల్లో సదుపాయాలు మెరుగుపరచాలి

మణికొండ, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపరచాలని ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ షేక్ అన్నారు. మణికొండ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సదుపాయాలు మెరుకుపడకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు. బడుల్లో ఉపాధ్యాయులు, మౌలిక వసతులు లేమితో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వసతులు కల్పించాలని కోరారు.

ఇద్దరు డ్రగ్స్ విక్రేతల అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 13: నగరంలో డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 4.7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 44వేల నగద మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు వివరాల ప్రకారం.. శాస్త్రీపురం ఎంఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద ఇద్దరు వ్యక్తులు నిషేధిత డ్రగ్స్‌ను కలిగి ఉన్నారని విశ్వసనీయ సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లారు. అనుమానస్పందంగా తిరుగుతున్న అబ్దుల్ సోహెల్ ఖాన్(25), సయ్యద్ నవాజ్(19)లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. వారి వద్ద బ్యాగ్‌లను పరిశీలించగా అందులో తెలుపు రంగుతో కూడిన డ్రగ్స్ ప్యాకెట్లు లభించాయి. అబ్దుల్ సోహెల్‌ఖాన్, సయ్యద్ నవాజ్ వైజాగ్‌కు చెందిన వెంకట్ నుంచి హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి ముంబాయిలోని ఒవైసీ, అక్తర్‌లకు ఎక్కువ ధరకు అమ్మేవారు. అట్లాగే వారి వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ డ్రగ్‌ను తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. నిందితుల వద్ద నుంచి 4.7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ ప్యాకెట్లు, 44 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు

హిమాయత్‌నగర్, జూన్ 13: నేతన్నలకు పని కల్పించి, చేనేత రంగాన్ని ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేసి, రెండు లక్షల ముద్ర లోన్స్ ఇవ్వాలని కోరారు. చేనేత మిత్ర, చేనేత చేయూత పథకాలను అమలు చేయాలన్నారు. సహకార సం ఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య, రాములు, ధనంజయ, యాదగిరి, భిక్షపతి, రాజయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

శృతి

శంషాబాద్ రూరల్, జూన్ 13: విద్యార్థిని అదృశ్యమైన సంఘటన గురువారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని ఇంద్రనగర్ దొడ్డికి చెందిన నానాజీపూరం శృతి(20) శంషాబాద్ పట్టణంలోని గౌతమి కళాశాలలో చదువుతోంది. రోజుమాదిరిగా కళాశాలకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీడీఎంఎస్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 63058958 67 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, 46క్వింటాళ్ల బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ కథనం ప్రకారం.. లబ్ధిదారుల నుంచి తక్కువకు కొని ఎక్కువ ధరకు విక్రయిస్తున్న 9 మందిని అరెస్ట్ చేశారు. విశాల్‌యాదవ్, మహ్మద్ నజీర్, మహ్మద్ షోహెబ్, మహ్మద్ జంగీర్, ఎండీ షాహబాజ్, లోవ అలియాస్ రాజు, సయ్యద్ రహీం, సయ్యద్ నజీమ్, మహ్మద్ మజహర్‌లను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 2.5 లక్షల విలువైన బియ్యం, గోధుమలతో పాటు ఒక బైక్, లారీని స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన

ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ఖైరతాబాద్, జూన్ 13: రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులకు బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం మింట్ కాంపౌండ్‌లోని కార్యాలయంలో అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ చట్టాలు, నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనాన్ని నిలిపే ఓపిక నేటి వాహనదారులకు ఉండటం లేదన్నారు. సిగ్నల్ జంప్ చేసి త్వరగా ఇంటికి చేరుకోవాలన్న ఆత్రుతతో తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మరికొందరు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపి ప్రమాదాలు చేసి అనేక మంది కుటుంబాల్లో శోకాలు నింపుతున్నారన్నారు. యూటర్న్ చేసే సమయంలో వ్యతిరేక దిశ నుంచి వచ్చే వాహనాలను గమనించాలని, ముందస్తుగా సిగ్నల్ మార్పులను గుర్తించి తమ వాహనాల వేగాన్ని తగ్గించుకోవాలన్నారు. నగరంలోనే అనేక బైకులు, కార్లను రాంగ్ రూట్లలో నడిపిస్తుండటం తాము గుర్తించామని, అలాంటి వారి వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. గతంల